
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు

బుధవారం ၊ 24 ၊ మే ၊ 2023



సోమశిలలో నీటి నిల్వ

చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారానికి 44.104 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 183 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రాములు)	రూ.62,170
22 క్యారెట్ల ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.5,583
3 శాతం జీఎస్టీతో	రూ.5,750
నవర (8 గ్రా)	రూ.46,000



వాతావరణం

జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఉష్ణోగ్రతలు కొంతమేర పెరిగాయి గాలిలో 59 శాతం తేమ ఉందని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

న్యూస్‌రీల్

జగనన్న విద్యాదీవెన నిధుల విడుదల నేడు

- విద్యార్థులు 37,485 మంది
- నిధులు రూ.34.36 కోట్లు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జగనన్న విద్యాదీవెన పథకానికి సంబంధించి రెండో త్రైమాసిక నిధులను విద్యార్థుల తల్లుల బ్యాంకు ఖాతాల్లో జమ చేసే కార్యక్రమాన్ని బుధవారం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తారని జిల్లా ఎస్సీ సంక్షేమ, సాధికారత అధికారి వెంకటయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో 37,485 మంది విద్యార్థులకు రూ.34.36 కోట్లు కేటాయించారన్నారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, కలెక్టర్ హరినారాయణన్ చేతుల మీదుగా చెక్కును విడుదల చేస్తారని తెలియజేశారు. జిల్లాలో ఎస్సీ విద్యార్థులు 331 మంది, ఎస్టీలు 1,709 మంది, బీసీలు 18,981 మంది, ఈబీసీలు 8,640 మంది, ముస్లింలు 4,967 మంది, కాపులు 2,737 మంది, క్రిస్టియన్లు 120 మంది విద్యార్థులు లబ్ధిదారులుగా ఉన్నట్లు వెల్లడించారు.

ఐరిస్ యంత్రాల ద్వారా సరుకుల పంపిణీ

- డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు



ఐరిస్ యంత్రాలను అందజేస్తున్న డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు

నెల్లూరు(పొగతోట): వేలిముద్రలు పడని కార్డుదారులకు ఐరిస్ యంత్రాల ద్వారా సరుకులు పంపిణీ చేయనున్నట్లు డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు తెలిపారు. నెల్లూరు డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఎండీయూ ఆపరేటర్లకు ఐరిస్ యంత్రాల నిర్వహణపై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డీఎస్‌ఓ మాట్లాడుతూ జిల్లాలో 7,22,239 మంది కార్డుదారులు, 1,513 చౌక దుకాణాలు ఉన్నట్లు చెప్పారు. 438 మంది ఎండీయూ ఆపరేటర్ల ద్వారా ప్రతినెలా రేషన్ పంపిణీ చేస్తున్నామన్నారు. వారిలో కొందరు వృద్ధులు, పనులు చేసే లబ్ధిదారులకు వేలిముద్రలు పడకపోవడంతో రేషన్ అందడం లేదన్నారు. ఈ విషయంలో ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుందన్నారు. వేలిముద్రలు పడని లబ్ధిదారుల కోసం ఐరిస్ యంత్రాలను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. దీనికి సంబంధించి ఎండీయూ ఆపరేటర్లకు ఐరిస్ యంత్రాలపై అవగాహన కల్పించి వాటిని అందజేశామన్నారు. కార్యక్రమంలో ఏఎస్‌ఓ అంకయ్య, సీఎస్‌డీటీ మురళి తదితరులు పాల్గొన్నారు.

కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం ప్రారంభం నేడు

వెంకటాచలం: మండలంలోని గొలమూడిలో ఉన్న భగవాన్ శ్రీవెంకయ్య స్వామి ఆశ్రమం వద్ద ఇటీవల నిర్మించిన వైద్యశాలలో దివ్యాంగుల కృత్రిమ అవయవాల తయారీ కేంద్రాన్ని బుధవారం ఉదయం ప్రారంభించనున్నారు. మహవీర్ జైన్ రిలీఫ్ ఫౌండేషన్ సహకారంతో తిరుపతిలోని టీటీడీ బర్డ్ హాస్పిటల్ పూర్వ డైరెక్టర్ డాక్టర్ జగదీష్ సూచనలతో దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చేందుకు ఆశ్రమ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ పి.బాలసుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉదయం 10.30 గంటలకు ఈ కేంద్రాన్ని ప్రారంభిస్తారు. మోచేయి కింది భాగం తొలగించబడిన పేషెంట్లను సాంకేతిక బృందం పరిశీలించి తగిన సలహాలిస్తారని, అవసరమైన వారికి తక్కువ ధరతోనే కృత్రిమ అవయవాలను అందిస్తారని ఈఓ మంగళవారం తెలియజేశారు. ఆశ్రమం తరఫున చేస్తున్న సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అల్లోపతి, ఆయుర్వేద వైద్యం, ఫిజియోథెరపీ సేవలు ఉచితంగా అందిస్తామని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఆనాడు టిడ్కో షో


పేదల ఇళ్ల విషయంలో చంద్రబాబు డ్రామా

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు కట్టిస్తున్న ఇళ్లపై దిగజారుడు వ్యాఖ్యలు చేసిన చంద్రబాబు తాను అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు స్థలాలు, పక్కాగృహాలు ఇచ్చిన దాఖలాల్లేవు. ఎన్నికలు సమీపిస్తున్నాయనగా టిడ్కో ఇళ్ల పేరుతో షో చేశారు. పేదలను రుణ గ్రహీతలుగా మార్చేసి వారి కష్టాన్ని దోచుకునేందుకు పక్కా స్కెచ్ వేశారు. అపార్ట్‌మెంట్లను పూర్తి చేయకుండా అరకొర వసతులతోనే ప్రారంభోత్సవం అంటూ హడావుడి చేశారు.

- టిడ్కో ఇళ్లు పూర్తి చేయని వైనం
- ఇళ్లకు దరఖాస్తు ఫీజులు, డిపాజిట్లు
- లబ్ధిదారులపై రుణ భారం
- ఎన్నికలు సమీపిస్తున్న సమయంలో హడావుడి
- దిగిపోయే నాటికి కీలక పనుల పెండింగ్



నెల్లూరులో అప్పట్లో అరకొర వసతులతో నిర్మించిన టిడ్కో ఇళ్లు (ఫైల్)



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు టిడ్కో ఇళ్ల పేరుతో చేసిన హడావుడి అంతా ఇంతా కాదు. 300 చదరపు అడుగులు (4.16 అంకణాలు), 365 చ.అ. (5 అంకణాలు), 430 చ.అ. (5.97 అంకణాలు) వంతున అపార్ట్‌మెంట్లు నిర్మించారు. ఇంత విస్తీర్ణంలో నిర్మించిన ఇళ్లు గుజ్జన గూళ్లే అని లబ్ధిదారులకు తెలుసు. ఎన్నేళ్లు ఉన్నా ఆ భవనాలు శిథిలం కావడమే తప్ప అదనంగా పెంచుకునేందుకు వెసులుబాటు లేదు. వీటిని చంద్రబాబు దిగిపోయే నాటికి పూర్తి చేయలేక చేతులెత్తేశారు. పోనీ ఆ గృహాలు పేదలకు ఉచితంగా అంటే అదీ లేదు. బ్యాంకు రుణాలు కల్పించి, ఇరవై ఏళ్లపాటు అప్పులు కట్టుకునే విధంగా ముడిపెట్టిన చరిత్ర బాబుది.

దోచుకున్నారు

టీడీపీ హయాంలో నెల్లూరు కార్పొరేషన్ పరిధిలోని వెంకటేశ్వరపురం, అల్లీపురం, అక్కచెరువుపాడు, కల్లూరుపల్లి, కొండ్లపూడి ప్రాంతాల్లో 373.19 ఎకరాల విస్తీర్ణంలో 34,032 ఇళ్ల నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. అప్పట్లో ఖరీదైన ప్రాంతాల్లో ప్రైవేట్ స్థలాలు కొనుగోలు చేసి, నిర్మించిన భవనాలకు చ.అ.కు రూ.2,500 ఉంటే.. ప్రభుత్వ స్థలాల్లో (ఉచితం) మాత్రం భవనాలకు సంబంధించి చ.అ.కు రూ.2 వేల ఖర్చు చేయడం వెనుక భారీ అవినీతి జరిగిందనే ఆరోపణలున్నాయి. వాస్తవంగా భారీ ఎత్తున నిర్మించే భవన సముదాయం కాబట్టి చదరపు అడుగుకు రూ.1,000 వంతున ఇచ్చినా గిట్టుబాటవుతుంది. కానీ అప్పటి ప్రభుత్వ పెద్దలు మాత్రం పేదోడికిచ్చే పక్కాఇళ్లపై గద్దల్లా వాలిపోయారు. ఇళ్ల నిర్మాణంలో సుమారు రూ.600 కోట్ల వరకు అప్పటి మంత్రులు, వారి అస్మదీయులు దోచుకున్నారనే ఆరోపణలున్నాయి.

ఆ టెక్నాలజీ పేరుతో..

టీడీపీ హయాంలో గొప్పగా నిర్మించామని చెప్పుకునే టిడ్కో ఇళ్ల నిర్మాణంలో ప్రతి చదరపు అడుగులో దోపిడీ ఉంది. నెల్లూరు నగరంలో ఖరీదైన ఏరియాగా పేరున్న మాగుంట లేఅవుట్‌లో అపార్ట్‌మెంట్ నిర్మాణంలో చదరపు అడుగుకు అప్పట్లో రూ.2,500 వరకు వెచ్చిస్తే ఆధునిక సౌకర్యాలతో కూడిన లగ్జరీ ఇల్లు పూర్తయ్యేది. నగర శివారు ప్రాంతాల్లో అయితే అపార్ట్‌మెంట్‌లో చదరపు అడుగుకు రూ.1,600 నుంచి రూ.1,800 వరకు మార్కెట్ ధర పలుకుతుండేది. అయితే పేదలకు కట్టించిన టిడ్కో ఇళ్లు జీ+3 భవన నిర్మాణాలను నగర నడిబొడ్డున స్థలాల్లో నిర్మించలేదు. శివారు ప్రాంతాల్లో కట్టారు. చదరపు అడుగుకు రూ.2,000 వంతున వ్యయం చేస్తున్నట్లు చెప్పి.. ఈ మొత్తాన్ని కూడా పేదలపై భారం పడేలా చేశారు.

గిరిజనుల భూములు లాక్కొని..

నగరంలోని 53వ డివిజన్ పరిధిలోని గాంధీగిరిజన కాలనీ, పడుగుపాడు పంచాయతీ పరిధిలోని చంద్రమౌళి గిరిజన సంఘం ప్రాంతాలకు చెందిన గిరిజనులకు 1978లో అప్పటి కలెక్టర్ శంకరన్ జనార్దనరెడ్డి సర్వే నంబర్లు 2207, 08, 20, 21, 22లో ఉన్న 63 ఎకరాల సీజేఎఫ్ఎస్ భూములను సాగు చేసుకుని జీవించేందుకు పంపిణీ చేశారు. ఆ భూముల్లో కొంతమంది గిరిజనులు సాగుచేస్తుండగా, మరికొందరు విక్రయాలు చేసుకున్నారు. సదరు భూములను కొనుగోలు చేసిన కొందరు చోటా నేతలు మట్టిని తవ్వేసి అమ్మేశారు. దీంతో ఆయా భూములు రోడ్డుకు 20 అడుగుల లోతున భారీ గుంతలతో చెరువును తలపించేలా తయారయ్యాయి. ఈ నేపథ్యంలో హౌస్ ఫర్ ఆల్ స్కీంలో పక్కాఇళ్ల నిర్మాణం కోసం భూముల అన్వేషిస్తుండగా గిరిజనుల సీజేఎఫ్ఎస్ భూములపై అప్పటి మంత్రి నారాయణ కళ్లు పడ్డాయి. వాటిని బలవంతంగా స్వాధీనం చేసుకొనేందుకు ప్రయత్నాలు జరగడంతో గిరిజనులు, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఒక దశలో తమ భూముల్లోకి కాలు మోపితే ఆత్మహత్యలు చేసుకుంటామని ముందుగా హెచ్చరించి ఓ గిరిజనుడు ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టిన ఘటన కూడా జరిగింది. అయినా ఏ మాత్రం లెక్క చేయని నారాయణ అధికార బలంతో ఆయా భూములను స్వాధీనం చేసుకున్నారు. గిరిజనులకు నష్టపరిహారం ఇస్తామన్న హామీని కూడా నేతలు విస్మరించారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏమి చేసిందంటే..

వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక ఏకకాలంలో వేలాది మంది పేదల సొంతింటి కల సాకారం చేసేందుకు చర్యలు తీసుకున్నారు. విలువైన భూములను సేకరించి ప్రైవేట్ లేఅవుట్లను తలపించే రీతిలో రోడ్లు, తాగునీటి వసతి, విద్యుత్ వంటి సదుపాయాలు కల్పించి పట్టణాల్లో సెంటు (6 అంకణాలు), పల్లెల్లో సెంటున్నర (9 అంకణాలు) ఇండిపెండెంట్ స్థలాలను ఇచ్చారు. గృహాలు కట్టుకునేందుకు రూ.1.80 లక్షలను గృహ నిర్మాణ శాఖ నుంచి ఆర్థిక సాయంతోపాటు ఉచితంగా ఇసుక, సబ్సిడీపై సిమెంట్, స్టీల్, ఇటుకలు సమకూరుస్తున్నారు. ఈ ఇండిపెండెంట్ స్థలాల్లో భవిష్యత్‌లో లబ్ధిదారుల ఆర్థిక పరిస్థితి మెరుగుపడితే పైన అదనపు అంతస్తులు నిర్మించుకునేందుకు అవకాశం ఉంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఉచితంగా అందించిన ఇంటి స్థలాల విలువ రూ.లక్షల్లో ఉంది.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

- డీఆర్వో వెంకటనారాయణమ్మ



మాట్లాడుతున్న డీఆర్వో వెంకటనారాయణమ్మ

నెల్లూరు(దర్గామిట్ట): ప్రకృతి వ్యవసాయంపై ఎస్సీ రైతులకు అవగాహన కల్పించి, ప్రోత్సాహకాలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని జిల్లా రెవెన్యూ అధికారి వెంకటనారాయణమ్మ తెలిపారు. నెల్లూరు కలెక్టరేట్‌లో ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో ఆమె మంగళవారం ప్రత్యేక సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్ర స్థాయిలో ఆర్‌వైఎస్ఎస్ వారు ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి చూపుతున్న ఎస్సీ రైతుల జాబితాను సిద్ధం చేసినట్లు చెప్పారు. ఇందుకు సంబంధించి వ్యవసాయ శాఖ, జిల్లా సీడ్ మేనేజర్, ప్రకృతి వ్యవసాయం జిల్లా మేనేజర్లతోపాటు ఎస్సీ కార్పొరేషన్ అధికారులతో కమిటీ ఏర్పాటు కావాలన్నారు. 21 మండలాల్లో ఆసక్తి చూపుతున్న రైతుల జాబితా ఉందన్నారు. క్షేత్రస్థాయిలో కమిటీ పరిశీలించి పూర్తి నివేదికను సిద్ధం చేయాలన్నారు. ఆయా రైతులకు ప్రభుత్వం విత్తనాలు, వ్యవసాయానికి అవసరమైన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తుందన్నారు. సమావేశంలో ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సారయ్య, ఈఓ పీటీ సెల్వకుమారి, ఆయా శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ఫలితాల విడుదల

- ఎస్ఎస్‌సీలో 79.19, ఇంటర్‌లో 82.72 శాతం ఉత్తీర్ణత

నెల్లూరు(టౌన్): ఏపీ ఓపెన్ స్కూల్ ఫలితాలు విడుదలయ్యాయి. జిల్లాలో ఎస్ఎస్‌సీలో 79.19 శాతం, ఇంటర్‌లో 82.72 శాతం మంది అభ్యాసకులు ఉత్తీర్ణులయ్యారు. ఈ ఏడాది ఏప్రిల్ 3 నుంచి 17వ తేదీ వరకు పరీక్షలు నిర్వహించారు. ఎస్ఎస్‌సీకి సంబంధించి జిల్లా వ్యాప్తంగా 1,139 మంది పరీక్షలు రాయగా 902 మంది ఉత్తీర్ణులయ్యారు. ఇంటర్‌కు సంబంధించి 2,975 మందికి 2,461 మంది ఉత్తీర్ణులయ్యారు. ఫెయిలైన వారు సప్లిమెంటరీ పరీక్షలకు ఈనెల 25వ తేదీలోపు ఫీజు చెల్లించాలని సంబంధిత అధికారులు మంగళవారం తెలిపారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు కృపాదాస్



మాట్లాడుతున్న కృపాదాస్

నెల్లూరు(సెంట్రల్): పంటలకు వినియోగించే పురుగు మందులు, ఎరువులు, విత్తనాలకు సంబంధించి నాణ్యతా ప్రమాణాలు పాటించాలని వ్యవసాయ శాఖ సంయుక్త సంచాలకుడు కృపాదాస్ అన్నారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో ప్రకాశం, నెల్లూరు జిల్లాల వ్యవసాయ అధికారులు, సిబ్బందికి మంగళవారం విత్తనాలు, పురుగు మందులు, ఎరువుల నియంత్రణ చట్టం అమలుపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా కృపాదాస్ మాట్లాడుతూ పంటలకు వినియోగించే పురుగు మందులు, ఎరువుల విషయంలో అధికారులు అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఎటువంటి చట్టాలు ఉన్నాయి, విక్రయదారులు అతిక్రమిస్తే ఏ చర్యలు తీసుకోవాలనే విషయాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. రైతులకు ఎక్కడా ఇబ్బందుల్లేకుండా చూడాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్‌రాజు మాట్లాడుతూ షాపులను నిత్యం తనిఖీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో అధికారులు వెంకటేశ్వరరావు, రాజన్, సుదర్శనరాజు, మద్దిలేటి, నర్సోజీ, సురేష్, శ్రీనివాసులు, మంజుల తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



వృద్ధురాలికి పథకాలను వివరిస్తున్న మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి

మనుబోలు: అవకతవకలకు ఆస్కారం లేకండా పారదర్శకంగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. మండలంలోని చెర్లోపల్లి గ్రామంలో మంగళవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా చేడిమాల బుజ్జిరెడ్డి, రమణకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, ప్రజలు కాకాణికి గజమాలతో స్వాగతం పలికారు. కాకాణి ప్రతి ఇంటికీ వెళ్లి పథకాల వల్ల జరిగిన లబ్ధిని వివరించారు. ఎక్కడైనా సాంకేతిక కారణాలతో పథకాలు అందలేదని చెబితే సమస్యను పరిష్కరించాలని చూడాలని అధికారులను ఆదేశించారు. గ్రామంలో రూ.2.50 కోట్లతో పూర్తి చేసిన సచివాలయ భవనం, ఆర్‌బీకే, సీసీ రోడ్లు, డ్రెయినేజీని మంత్రి ప్రాంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రజలు సంక్షేమ పథకాలు అందుకోవాలంటే జన్మభూమి కమిటీ సభ్యులు, టీడీపీ నాయకుల సిఫార్సులు అవసరమయ్యేవని చెప్పారు. అర్హులకు లబ్ధి చేకూరకుండా వారు అడ్డు తగిలే వారన్నారు. దీంతో అర్హులకు అన్యాయం జరిగేదన్నారు. దీనికి భిన్నంగా నేడు రాజకీయ నాయకుల జోక్యం లేకుండా అర్హతే ప్రామాణికంగా సచివాలయాలు, వలంటీర్ల ద్వారా నేరుగా సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామన్నారు. ప్రజలకిచ్చిన ప్రతి హామీని నెరవేర్చి వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు ధైర్యంగా ప్రజల్లోకి వెళ్లేలా చేసిన ఘనత సీఎంకు దక్కుతుందన్నారు. మండలంలో గడప గడపకు కార్యక్రమం పూర్తవుతుందని, అందులో ఇచ్చిన ప్రతి హామీని నెరవేర్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామాల్లో అదనపు విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసి విద్యుత్ కొరత లేకుండా చేస్తున్నామన్నారు. చెర్లోపల్లి సచివాలయ పరిధిలో రూ.3.40 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. గ్రామంలో గతంలో గిరిజనులకు ఇచ్చిన ఇందిరమ్మ పక్కాఇళ్లు దెబ్బతిన్నాయని, వాటి స్థానంలో కొత్త ఇళ్లు కట్టించి ఇచ్చేలా అధికారులకు ఆదేశాలిచ్చామని తెలిపారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీనారాయణ, ఎంపీపీ గుండాల వజ్రమ్మ, సర్పంచ్ చేడిమాల శ్రీలత, పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్, హౌసింగ్ ఏఈలు కార్తీక్‌రెడ్డి, రవికుమార్, నాయకులు నారపరెడ్డి కిరణ్‌కుమార్‌రెడ్డి, బొమ్మిరెడ్డి హరగోపాల్‌రెడ్డి, చిట్టమూరు అజయ్‌రెడ్డి, కడివేటి చంద్రశేఖర్‌రెడ్డి, మన్నెమాల సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏడు రౌండ్ల పొగాకు వేలం

మర్రిపాడు (ఆత్మకూరురూరల్): మర్రిపాడు మండలం డీసీపల్లి పొగాకు బోర్డు వేలం కేంద్రంలో ఏడు రౌండ్ల పొగాకు వేలం ముగిసే నాటికి రైతుల నుంచి రూ.103 కోట్లకు పైగా విలువైన ఉత్పత్తులను కొనుగోలు చేశామని వేలం కేంద్రం నిర్వహణ అధికారి జి.రాజశేఖర్ పేర్కొన్నారు. కేంద్రంలోని తన కార్యాలయంలో మంగళవారం ఆయన వివరాలు వెల్లడించారు. జిల్లాలోని 18 మండలాలకు చెందిన పొగాకు రైతులు ఇప్పటి వరకు 43,397 బేళ్లను తీసుకురాగా, 40,867 బేళ్లను 17 కంపెనీల బయ్యర్లు కొనుగోలు చేశారన్నారు. కిలోకు గరిష్ఠంగా రూ.201, కనిష్ఠంగా రూ.174 ధర నమోదైందని తెలిపారు. కొనుగోళ్ల విషయంలో ఐటీసీ కంపెనీ అగ్రస్థానంలో ఉందన్నారు. బుధవారం నుంచి 8వ రౌండ్ వేలం ప్రారంభిస్తున్నామన్నారు. ఒక్కో బ్యారెన్‌కు 4 బేళ్ల వంతున వేలంలో అనుమతిస్తున్నామని తెలిపారు. రైతులు నాణ్యమైన ఉత్పత్తులను తీసుకొచ్చి గిట్టుబాటు ధరలు పొందాలన్నారు.

విద్యుత్ శాఖలో బదిలీలు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలోని నెల్లూరు జిల్లా సర్కిల్లో విధులు నిర్వహిస్తున్న విద్యుత్ ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది బదిలీల ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. సీఎండీ ఉత్తర్వుల మేరకు ఐదు సంవత్సరాల నుంచి ఒకేచోట విధులు నిర్వహిస్తున్న వారికి సాధారణ బదిలీలు (జనరల్ ట్రాన్స్‌ఫర్స్), రెండేళ్ల ఒకేచోట విధులు పూర్తి చేసుకున్న వారికి మ్యూచువల్, రిక్వెస్ట్ (ఇద్దరి అంగీకారం, వినతి)పై బదిలీలు జరుగుతాయి. వీటికి సంబంధించి 24వ తేదీన జాబితా తయారు చేసి విద్యుత్ భవన్‌లో ప్రచురిస్తారు. 31వ తేదీన బదిలీ అయిన వారికి పోస్టింగ్ ఉత్తర్వులు ఇస్తారు.

గంజాయి రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం

- ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి



పోలీస్‌స్టేషన్‌లో వాహనాలను పరిశీలిస్తున్న ఎస్పీ

వెంకటాచలం: గంజాయి అక్రమ రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి తెలిపారు. వెంకటాచలం పోలీస్ స్టేషన్‌ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది పని తీరును ఆరా తీశారు. రికార్డులు, స్టేషన్‌లోని అన్ని విభాగాలను పరిశీలించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జాతీయ రహదారులపై రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బ్లాక్‌స్పాట్లను గుర్తించి సైన్‌బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మద్యం మత్తులోనే రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయన్నారు. అందువల్ల డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులను ముమ్మరంగా చేయాలన్నారు. హైవే మొబైల్స్ నిరంతరం గస్తీ నిర్వహించి ప్రమాదాలతోపాటు నేరాలు జరగకుండా చూడాలన్నారు. వేసవి దృష్ట్యా దొంగతనాలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంతో పాటు చోరీ కేసుల్లో నిందితుల అరెస్ట్, సొత్తు రికవరీపై దృష్టి సారించాలని ఆదేశించారు. ఎల్‌హెచ్ఎంఎస్‌పై అవగాహన కల్పించాలన్నారు. రౌడీషీటర్లు, అసాంఘిక శక్తులను ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించరాదని కఠినంగా వ్యవహరించాలన్నారు. మహిళలు, చిన్నారుల రక్షణ కోసం ఏర్పాటు చేసిన చట్టాలు, దిశ యాప్‌పై అవగాహన కల్పించాలన్నారు. వివిధ కేసుల్లో పట్టుకున్న వాహనాలను కోర్టు అనుమతితో వేలం వేయాలన్నారు. అనంతరం సిబ్బంది యోగక్షేమాలను ఎస్పీ అడిగి తెలుసుకున్నారు. ప్రతి శుక్రవారం నిర్వహించే గ్రీవెన్స్ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ఆయన వెంట నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, వెంకటాచలం ఇన్‌స్పెక్టర్ గంగాధర్, ఎస్సై అయ్యప్ప తదితరులున్నారు.

మహిళా మార్టులు వచ్చేశాయ్

మహిళల ఆర్థికాభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోంది. స్వయం సహాయక సంఘాల మహిళలు వ్యాపార నైపుణ్యం పెంపొందించుకుంటూ సుస్థిర జీవనోపాధితో పాటు వారి కుటుంబ జీవన స్థితిగతులను మెరుగుపరుకోవాలనే లక్ష్యంతో వారితో చేయూత మహిళా మార్టులు ఏర్పాటు చేయిస్తోంది. ఎస్‌హెచ్‌జీ సభ్యులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు అందించడం, మహిళలు ఆర్థిక సాధికారత సాధించడం మార్టుల ఏర్పాటు ప్రధాన ఉద్దేశం.


కందుకూరులోని చేయూత మహిళ మార్టు

- ఎస్‌హెచ్‌జీ మహిళల ఆర్థికాభివృద్ధికి బాటలు వేస్తున్న రాష్ట్ర ప్రభుత్వం
- రూ.20 లక్షల నుంచి 25 లక్షలతో మార్టు
- ఇప్పటికే కందుకూరులో ఏర్పాటు
- నేడు వింజమూరులో ప్రారంభం
- త్వరలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఏర్పాటుకు చర్యలు

నెల్లూరు(పొగతోట): స్వయం సహాయక గ్రూపు(ఎస్‌హెచ్‌జీ) మహిళలను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. ప్రస్తుతం చేయూత మహిళ మార్టులు(సీఎంఎం) ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో రెండు చేయూత మహిళా మార్టులు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్దేశించింది. కందుకూరులో చేయూత మహిళ మార్టు ఏర్పాటు చేశారు. వింజమూరులో రెండో చేయూత మహిళ మార్టు బుధవారం ప్రారంభించనున్నారు. మార్టుల ద్వారా నాణ్యమైన నిత్యావసర సరుకులు తక్కువ ధరలకు అందిస్తున్నారు. గ్రూపులో ఉండే మహిళలే కాకుండా మహిళా మార్టులో ఎవరైనా కొనుగోలు చేయవచ్చు. కార్పొరేట్ స్థాయిలో మార్టులు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది. దీనికి సంబంధించి డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకున్నారు.

ప్రభుత్వ సాయంతో..

జిల్లాలో 38 మండలాలు ఉన్నాయి. సుమారు 44 వేల స్వయం సహాయక గ్రూపులు ఉన్నాయి. సుమారు 5 లక్షల మందికి పైగా మహిళలు గ్రూపుల్లో సభ్యులుగా ఉంటూ పొదుపు చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి సాధిస్తున్నారు. ప్రభుత్వ సాయంతో అనేక మంది మహిళలు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని చిన్నచిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకుంటున్నారు. మరికొంతమంది మహిళలు తీసుకున్న రుణాలతో కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసుకుని ఆర్థికాభివృద్ధి సాధిస్తున్నారు. కుటీరపరిశ్రమలు, బ్యూటీషియన్ షాపులు, కూల్‌డ్రింక్ షాపులు, జెరాక్స్, ఐస్‌క్రీమ్ పార్లర్లు ఏర్పాటు చేసుకుని అభివృద్ధి చెందుతున్నారు. మహిళల అభ్యున్నతికి ప్రభుత్వ సహకారంతోపాటు జిల్లా డీఆర్‌డీఏ అధికారులు సహాయం అందిస్తున్నారు. చేయూత మహిళ మార్టులు ఆయా ప్రాంతాల ఎస్‌హెచ్‌జీ మహిళలందరి నుంచి ఒక్కొక్కరి నుంచి రూ.200 వసూలు చేసి మార్టులు ఏర్పాటు చేస్తున్నారు. మార్టుకు మహిళలే అధ్యక్షులుగా, కార్యదర్శులు, కోశాధికారులుగా ఉంటారు. నిర్వహణ బాధ్యతలు, క్రయ విక్రయాలు చేసేది ఎస్‌హెచ్‌జీ మహిళలే. సంవత్సరానికి ఖర్చులు, ఆదాయం చూసుకుని మిగిలినది షేర్ క్యాపిటల్ పెట్టిన మహిళలందరూ పంచుకుంటున్నారు.

జిల్లాలో..	
మండలాలు	38
స్వయం సహాయక గ్రూపులు	సుమారు 44 వేలు
సభ్యులు	5 లక్షల మందికి పైగా..

మార్టు ఏర్పాటు చేసే విధానం

మండల సమాఖ్య సర్వసభ్య సమావేశం లేదా కార్యనిర్వాహక కమిటీ సమావేశంలో చేయూత మహిళా మార్టు ఏర్పాటు అంశంపై అజెండాలో చర్చించి తీర్మానం చేయాలి. మార్టు ఏర్పాటుకు మార్గదర్శకాలు, కార్యాచరణ ప్రణాళిక రూపొందించి ఆమోదం తీసుకోవాలి. మండల సమాఖ్యలో సభ్యత్వం ఉన్న ప్రతి మహిళ సీఎంఎంలో వాటాదారులుగా చేరేందుకు అంగీకార తీర్మానం తీసుకోవాలి. సీఎంఎంలో చేరడం పూర్తి స్వచ్ఛందం. బలవంతం లేదు. సభ్యుల వాటాధనాన్ని సీఎంఎం బ్యాంక్ అకౌంట్‌కు జమ చేసి రశీదు తీసుకోవాలి. ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన ఆసక్తి కలిగిన 11 మంది మహిళలు, మండల సమాఖ్య నిర్దేశించిన సభ్యులు, కార్యనిర్వాహక సభ్యులతో చేయూత మహిళా మార్టు ఏర్పాటు చేయవచ్చు. సెర్ప్ నియమ నిబంధనల ప్రకారం పరస్పర సహాయ సహకార సంస్థ చట్టం పరిధిలో సీఎంఎంను రిజిస్ట్రేషన్ చేయించాలి.

ఎంపిక చేసిన కంపెనీలు

నిత్యావసర సరుకులు ఎంపిక చేసిన కంపెనీల నుంచి చేయూత మార్టు నిర్వాహకులు కొనుగోలు చేయాల్సి ఉంది. నాణ్యతలో రాజీపడకుండా వినియోగదారులకు తక్కువ ధరలకు సరుకులు అందించాల్సి ఉంది. మార్టు నిర్వాహకులు వచ్చిన సరుకులను పరిశీలించి బార్‌కోడ్ వేసి స్టాక్‌పాయింట్‌లో ఏర్పాటు చేయాలి. నిత్యం ధరలు పరిశీలించి వినియోగదారులకు మార్టుపై నమ్మకం కలిగేలా అవసరమైన చర్యలు తీసుకోవాలి.

నియోజకవర్గానికి ఒకటి ఏర్పాటు



చేయూత మహిళా మార్టులు(సీఎంఎం) ఏర్పాటు చేయమని ప్రభుత్వం ఆదేశాలిచ్చింది. కందుకూరులో ఏర్పాటు చేశాం. ప్రస్తుతం వింజమూరులో మార్టు ప్రారంభించనున్నాం. త్వరలో నియోజకవర్గానికి ఒక్కొక్కటి చొప్పున ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. మార్టుల ఏర్పాటు, నిర్వహణ బాధ్యతలను మహిళలు చూసుకుంటారు. మార్టుల ఏర్పాటుకు వారే పెట్టుబడి పెడతారు. వచ్చిన ఆదాయాన్ని అందరూ సమానంగా తీసుకుంటారు.

– సాంబశివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ

నాణ్యమైన సరుకులు అందిస్తున్నాం



సీఎంఎం ద్వారా వినియోగదారులకు నాణ్యమైన సరుకులు అందిస్తున్నాం. నాణ్యతలో రాజీపడడం లేదు. సీఎంఎంపై వినియోగదారులకు నమ్మకం కలిగేలా చర్యలు తీసుకుంటున్నాం. కమిటీలో సభ్యులందరూ కలిసి ఉంటూ సీఎంఎం అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నాం.

– ఎం.మహాలక్ష్మి, సీఎంఎం అధ్యక్షురాలు, మహాదేవపురం, కందుకూరు

అందరి సహకారంతో..



అందరి సహాయ సహకారాలతో సీఎంఎం ఏర్పాటు చేశాం. మార్టు రోజురోజుకూ అభివృద్ధి చెందుతోంది. మార్టు నిర్వహణలో ఎలాంటి లోపాలు లేకుండా చర్యలు తీసుకుంటున్నాం. అందరం కలిసి పనిచేసుకుంటున్నాం. ఖర్చులు ఇతర వివరాలు ఎప్పటికప్పుడు రికార్డులో నమోదు చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. వచ్చిన ఆదాయం అందరికీ అందిస్తాం.

– ఈశ్వరమ్మ, సీఎంఎం కార్యదర్శి, ఆనందపురం, కందుకూరు

భూముల రీ సర్వేపై నిర్లక్ష్యం వద్దు

- కలెక్టర్ ఎం.హరినారాయణన్


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ హరినారాయణన్, పక్కన జేసీ కూర్మనాథ్

నెల్లూరు(దర్గామిట్ట): ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల రీ సర్వే కార్యక్రమంపై రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యం వహించవద్దని కలెక్టర్ ఎం.హరినారాయణన్ తెలిపారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వే మొదటి, రెండు దశల అమలుపై ఆర్డీఓలు, తహసీల్దార్లు, సర్వేయర్లతో మంగళవారం కలెక్టరేట్ నుంచి ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భూముల రీ సర్వే చేసిన తర్వాత భూహక్కు పత్రాలను సంబంధిత యజమానులకు మాత్రమే ఇవ్వాలని, ఇతరులకు ఇవ్వవద్దని సూచించారు. భూహక్కు పత్రాలకు సంబంధించి భూయజమానుల ఫొటోలు అప్‌లోడ్ వేగవంతం చేయాలన్నారు. సీసీఎల్‌ఏ నుంచి ప్రగతిపై నివేదికలు కోరుతున్నందున తహసీల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించి త్వరగా పూర్తిచేయాలని తెలిపారు. మిషన్ మోడ్‌లో రీ సర్వే చేయాల్సి ఉండగా సర్వే అధికారులు సక్రమంగా చేయడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. సర్వే జిల్లా అధికారి పనితీరుపై ల్యాండ్ సర్వే ఉన్నతాధికారులకు లేఖ రాస్తామన్నారు. అధికారులు పూర్తిస్థాయి సమాచారంతో సమావేశానికి రావాలని కలెక్టర్ తెలిపారు. జాయింట్ కలెక్టర్ కూర్మనాథ్ మాట్లాడుతూ రీ సర్వే, సర్వే రాళ్ల ఏర్పాటు త్వరగా పూర్తి చేయాలని, వేసిన రాళ్లకు జియోట్యాగింగ్ చేయాలన్నారు. రీ సర్వేలో ఏవైనా పొరపాట్లు జరిగితే తహసీల్దార్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. సమావేశంలో ఏడీ ల్యాండ్ సర్వేయర్ హనుమాన్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రూ.కోటి విలువైన కెమెరాలు స్వాధీనం?

కావలి: కావలి ఒకటో పట్టణ పోలీసులు భారీ చోరీ కేసును ఛేదించి రూ.కోటి విలువైన కెమెరాలు, లెన్స్ స్వాధీనం చేసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. కాకినాడలో చోరీ జరగగా కావలి పోలీసులు చాకచక్యంగా వ్యవహరించి సాంకేతిక ఆధారాలతో నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. విశ్వసనీయ వర్గాల కథనం మేరకు బెంగళూరుకు చెందిన ముఠా కాకినాడలో ఇటీవల సినిమా షూటింగ్ పేరుతో హైదరాబాద్ నుంచి ఖరీదైన అద్దె కెమెరాలు తెప్పించింది. షూటింగ్ నెపంతో కెమెరాలకు సంబంధించిన వ్యక్తుల కళ్లుగప్పి కెమెరాలు, లెన్స్‌లతో బెంగళూరుకు ఉడాయించారు. ఆలస్యంగా విషయం గ్రహించిన కెమెరాల యజమాని కాకినాడ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశాడు. ఇదే సమయంలో కావలిలో ఇటీవల జరుగుతున్న వరుస దొంగతనాలపై దర్యాప్తు ముమ్మరం చేసిన ఒకటో పట్టణ పోలీసులు పాతనేరస్తుల కదలికలపై నిఘా ఉంచారు. ఈక్రమంలో కాకినాడలో కెమెరాలు చోరీ చేసిన దొంగను కావలి ఒకటో పట్టణ పోలీసులు ఒక్కరోజు వ్యవధిలోనే గుర్తించి అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది. నిందితుడి నుంచి కెమెరాలు, లెన్స్ స్వాధీనం చేసుకున్నట్లుగా సమాచారం. ఈ విషయంపై కాకినాడ పోలీసులు కూడా కావలికి చేరుకుని ఇక్కడి పోలీసు అధికారులతో చర్చిస్తున్నట్లుగా తెలిసింది. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది.

క్లుప్తంగా

నేడు ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్


నెల్లూరు(టౌన్): జిల్లాలో హైస్కూల్ ప్లస్(బాలికల)ల్లో ఉపాధ్యాయులుగా పనిచేసేందుకు దరఖాస్తు చేసుకున్న వారు, కొత్తగా దరఖాస్తు చేసుకునే వారికి బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్స్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ గంగాభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిషత్ హైస్కూల్ ప్లస్‌లకు సంబంధించి ఇంగ్లిష్-3, మ్యాథ్స్-1, ఫిజిక్స్-6, కెమిస్ట్రీ-1, జువాలజీ-1, సివిక్స్-6, ఎకనామిక్స్-2, కామర్స్-4, ప్రభుత్వ హైస్కూల్ ప్లస్‌లకు సంబంధించి ఇంగ్లిస్-5, తెలుగు-4, మ్యాథ్స్-2, ఫిజిక్స్-5, కెమిస్ట్రీ-3, బాటనీ-2, జువాలజీ-3, సివిక్స్-2, ఎకానమిక్స్-1, కామర్స్-1 పోస్టులు ఖాళీలు ఉన్నాయని తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికెషన్‌కు హాజయ్యేవారు సర్వీస్ రిజిస్టర్‌ను తీసుకురావాలని తెలిపారు.

యువతి ఆత్మహత్య

నెల్లూరు(క్రైమ్): మోసాన్ని తట్టుకోలేక ఓ యువతి ఆత్మహత్యాయత్నానికి పాల్పడి ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందింది. పోలీసుల సమాచారం మేరకు వేదాయపాళేనికి చెందిన అరుణ(26)కు కొండాయపాళెం గేటు వద్ద ఓ ఇంట్లో వాచ్‌మన్‌గా పనిచేస్తున్న బి.తేజతో పరిచయమైంది. తేజ ఆమెకు మాయ మాటలు చెప్పి లోబర్చుకున్నాడు. కొంతకాలం వారిద్దరూ సహజీవనం చేశారు. ఇటీవల తేజ ఆమెను పట్టించుకోవడం మానేశాడు. దీంతో మనస్తాపానికి గురైన ఆమె ఈ నెల 22వ తేదీన గడ్డిమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ విషయాన్ని గమనించిన స్థానికులు ఆమెను చికిత్సనిమిత్తం జీజీహెచ్‌లో చేర్పించారు. అక్కడ చికిత్సపొందుతూ మంగళవారం అరుణ మృతిచెందింది. ఈ మేరకు దర్గామిట్ట పోలీసులు కేసు విచారిస్తున్నారు.

పొదలకూరు నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.50
సన్నవి	: రూ.22
పండ్లు	: రూ.15



నకిలీ పత్రాలు సృష్టించి స్థల రిజిస్ట్రేషన్లు


- బాధితురాలి ఫిర్యాదుపై కేసు నమోదు
- స్టేషన్‌లో పంచాయితీ చేస్తున్నారని ప్రచారం

నెల్లూరు(క్రైమ్): ఓ వృద్ధురాలికి సంబంధించిన రూ.కోట్ల స్థలానికి కొందరు నకిలీ పత్రాలు సృష్టించి వేరేవారికి రిజిస్ట్రేషన్లు చేశారు. ఈ ఘటనపై బాలాజీనగర్ పోలీసులు కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. పోలీసుల కథనం మేరకు.. రామ్మూర్తినగర్‌కు చెందిన ఓ మహిళకు జగదీష్‌నగర్‌లో 1.34 ఎకరాల భూమి ఉంది. ఇటీవల ఇద్దరు ఆ భూమిని తమ భూమిగా నకిలీ పట్టా, సర్వే రిపోర్టులు సృష్టించి ఆరుగురికి రిజిస్ట్రేషన్ చేశారు. ఆ మహిళ తన భూమి రికార్డులు పరిశీలిస్తుండగా ఈ విషయం వెలుగులోకి వచ్చింది. నకిలీ పట్టా, సర్వే రిపోర్టులను సృష్టించి తన భూమిని కాజేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఈ నెల 20వ తేదీన ఆమె బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు చీటింగ్ కేసు నమోదు చేశారు. కేసు విచారణలో భాగంగా గడచిన రెండు, మూడు రోజులుగా పోలీసులు ఫిర్యాదులో పేర్కొన్న సదరు వ్యక్తులను విచారిస్తున్నారు. విచారణలో ఓ వ్యక్తే ఈ ఘటనకు పాల్పడినట్లు తేలింది. దీంతో అతనిని అరెస్ట్ చేయనున్నారు. అయితే మంగళవారం రాత్రి పోలీసు అధికారులు పోలీసుస్టేషన్‌లోనే రిజిస్ట్రేషన్ రద్దు చేయించేందుకు యత్నిస్తున్నారన్న ప్రచారం జోరుగా సాగింది. ఈ విషయమై సంబంధిత పోలీసు అధికారులను వివరణ కోరగా అలాంటిదేమీ లేదని, కేసు విచారిస్తున్నామని తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా

చేజర్ల: ట్రాక్టర్ అదుపు తప్పి బోల్తాపడిన ఘటన చేజర్ల మండలంలోని ఉలవపల్లి సమీపంలో మంగళవారం చోటుచేసుకుంది. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం నుంచి ఎరువుతో వస్తున్న ట్రాక్టర్ ఉలవపల్లికి సమీపంలో ట్రాక్టర్ అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయింది. ఈ ప్రమాదంలో ఎవరికీ ఏమీ కాలేదు.

హుండీ కానుకల లెక్కింపు


కానుకలను లెక్కిస్తున్న సిబ్బంది

బుచ్చిరెడ్డిపాళెం: మండలంలోని జొన్నవాడలో వెలసిన శ్రీమల్లికార్జున స్వామి సమేత కామాక్షితాయి అమ్మవారి ఆలయంలో హుండీ కానుకలను మంగళవారం లెక్కించారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ పుట్టా సుబ్రహ్మణ్యంనాయుడు మాట్లాడుతూ మార్చి 28 నుంచి ఈ నెల 23వ తేదీ వరకు భక్తులు హుండీల్లో వేసిన కానుకలను లెక్కించినట్లు తెలిపారు. హుండీల ద్వారా రూ.32,46,742 ఆలయానికి సమకూరినట్లు తెలిపారు. అలాగే 141 గ్రాముల 200 మిల్లీ గ్రాముల బంగారు ఆభరణాలు, 141 గ్రాముల 500 మిల్లీగ్రాముల వెండి ఆభరణాలు వచ్చాయన్నారు. దీంతోపాటు నిత్యాన్నదాన హుండీ ద్వారా రూ.1,17,472 నగదు, మలేసియా రింగెట్స్-1, కతర్ సెంట్రల్ బ్యాంక్ కరెన్సీ-1 చొప్పున వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఈఓ వెంకటేశ్వర్లు, పాలకమండలి సభ్యులు, బ్యాంక్ అధికారులు, పోలీసులు పాల్గొన్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్) : 141
లేయర్ (లైవ్) : 98
బ్రాయిలర్ చికెన్ : 242
బ్రాయిలర్ స్కిన్‌లెస్ : 268
లేయర్ చికెన్ : 167

బాలికను మాయమాటలతో లోబర్చుకుని..

- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తికి ఇది వరకే వివాహమై భార్యతో మనస్పర్థల కారణంగా విడిపోయి ఉన్నాడు. సమీపంలో ఉంటున్న ఓ బాలికను పెళ్లిచేసుకుంటానని మాయమాటలతో లోబర్చుకుని అనంతరం వదిలివేశాడు. బాలిక తల్లి ఫిర్యాదు మేరకు వేదాయపాళెం పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు. వివరాలు.. అంబాపురానికి చెందిన ఓ బాలిక తొమ్మిదో తరగతి చదివి ప్రస్తుతం ఇంటి వద్దనే ఉంటోంది. మూడు నెలల క్రితం ఆమె ఇంటికి సమీపంలో పి.వెంకటేశ్వర్లు ఓ ఇల్లు అద్దెకు తీసుకున్నాడు. అయనకు ఇది వరకే వివాహమైంది. భార్యతో మనస్పర్థల కారణంగా విడిపోయాడు. అతని కన్ను బాలికపై పడింది. ఆమెను ప్రేమిస్తున్నానని, పెళ్లిచేసుకుంటానని నమ్మించడం ప్రారంభించాడు. ఈ విషయం గమనించిన బాలిక కుటుంబసభ్యులు అతడిని మందలించారు. అయినప్పటికీ అతను తన పద్ధతి మార్చుకోలేదు. ఈ నెల 19వ తేదీన బాలికను తన వెంట తీసుకెళ్లాడు. బాలిక తల్లిదండ్రులు ఆమె కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలోనే వెంకటేశ్వర్లు బాలికకు తాళికట్టి గూడూరులో ఉంటున్న తన అక్క ఇంటికి తీసుకెళ్లాడు. అక్కడ బాలికను లోబర్చుకున్నాడు. వెంకటేశ్వర్లును ఆయన తల్లిదండ్రులు మందలించడంతో ఆ బాలికను ఈ నెల 21వ తేదీన ఆమె ఇంటికి సమీపంలో వదిలి పరారయ్యాడు. బాలికను తల్లిదండ్రులు నిలదీయగా జరిగిన విషయాన్ని తెలియజేసింది. ఈ మేరకు బాలిక తల్లి మంగళవారం వేదాయపాళెం పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేశారు.

వ్యభిచార గృహంపై దాడి

కావలి రూరల్: నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి మహిళలను కావలికి తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తుండగా మంగళవారం పోలీసులు దాడులు చేసి ఇద్దరు మహిళలను అదుపులోకి తీసుకున్నారు. కావలి రూరల్ సీఐ ఎం.రాజేష్ తెలిపిన సమాచారం మేరకు కావలిరూరల్ స్టేషన్ పరిధిలోని ముసునూరు ఇందిరమ్మకాలనీ బీఈడీ కళాశాల పక్కన ఓ మహిళ కొంతకాలంగా నెల్లూరు, ఒంగోలు తదితర ప్రాంతాల నుంచి మహిళలను తీసుకువచ్చి వ్యభిచారం నిర్వహిస్తోంది. ఈ క్రమంలో స్థానికుల సమాచారం మేరకు మంగళవారం పోలీసులు వెళ్లి దాడి చేసి నిర్వాహకురాలితోపాటు మరో మహిళను అదుపులోకి తీసుకున్నారు. వీరిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు.